గుండె గొంతుకలోన

పంతుల జోగారావు



"హేమా, ఇదిగో యిలారా, మాట" ముందు గదిలో నుంచి భర్త గొంతు కొంచెం గట్టిగా వినిపించడంతో కంగారుపడుతూ వెళ్లింది హేమ. ముందుగదిలో డాక్టర్ రాఘవ డ్రస్ చేసుకుని సోఫాలో కూచుని ఉన్నాడు.

"ఏమయిందండీ, పిలిచారు" అంది హేమ.

"నీకీ మూగి ముండ తప్ప యీ ఊర్లో మరో పని మనిషి దొరకలేదా ?" విసుగ్గా అడిగేడు రాఘవ.

"ఏ మి టం డీ, ఏమైందసలు ?" తెల్లబోతూ విషయం అర్థంకాక మళ్లీ అడిగిందామె.

"ఈ మూగి పీనుక్కి తెలీదు, చెప్తే అర్థంకాదు.. చూడు, గదిలో దుమ్ము అంతా తుడిచి నా బూట్సు మీదకి ఎలా చిమ్మిందో ఇప్పుడీ డర్టీ బూట్సుని పాలిష్ చేసుకునే సరికి నా తల ప్రాణం తోకకి వస్తుంది అసలీ ఊర్లో మరో పని వాళ్లు దొరకనట్టు దీన్నే పెట్టుకోవడం ఎందుకు ? ఇవాళే పన్లోంచి తీసెయ్" రాఘవ కోపంగా అన్నాడు

హేమ అతను చూపించిన వేపు చూసింది అతను వేసుకోవలసిన బూట్సు ధూళి పేరుకుపోయి ఉన్నాయి దాని పక్కనే చీపురు పడి

వుంది. హేమకి నవ్వు ముంచుకొచ్చింది. నవ్వితే భర్త ఏమనుకుంటాడో అని పెదిమిల మధ్యే నవ్వుని అదిమి పెట్టింది.

''అయ్యో, ఇది మన లిల్లీ పనండీ . ఇవాళింకా రంగి పనిలోకి రానేలేదు. లిల్లీ యిందాక చీపురు పట్టుకోవడం చూసేను ఇదన్నమాట అది చేసిన నిర్వాకం. .'' అంది

అంత కోపంలోనూ రాఘవకి నవ్వు వచ్చింది తల్లిదండ్రుల మాటలు వినిపించి ఆడుకుంటున్న లిల్లీ వచ్చి తల్లి వెనక్కి చేరింది. కూతురి తల నిమురుతూ ''ఏమ్మా గది తుడిచింది నువ్వేనా?'' అనడిగింది హేమ.

''ఊ ..'' తలూపింది లిల్లీ

రాఘవ నవ్వేస్తూ ''నాటీ గర్ల్ ... నా బూట్సు ఎలా పాడయిపోయాయో చూడు నీ కెందుకమ్మా యిలాంటి పనులు ..''అన్నాడు

''ఒక్కక్షణం మీరలా కూచోండి... పాలిష్ చేసి ఇస్తాను'' అంటూ వాటినందుకుంది హేమ

ఇంతలో వీధిలో రంగి గొంతు వినిపించింది. దానికి మాటలురావు. మూగది. కాని, రకరకాల ధ్వనులు నోటితో చేస్తూ, చేతులు త్రిప్పుతూ తన భావాలు యితరులకి అర్థమయేలా చెప్పడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది.

రాఘవకి దాని గొంతు వింటేనే తగని చిరాకు. ''ఏమిటలా వికారంగా అరుపులూ కేకలూను— అడవి మనిషిలా. నోరు మూసుకుని, నీ పని నువ్వు చేసుకుపోరాదూ ?'' అని గట్టిగా కసిరేదు ఒకరోజు.

అతని మాటల్తో అది కళ్ళలో నీళ్ళు పెట్టుకుంది. పెరట్లోకి వెళ్ళి గిన్నెలు తోముతూ వెక్కివెక్కి ఏడవసాగింది. దాని ఏడుపు వినడానికే వికారంగా వుంది

దాని బాధ చూడలేక— ''అదేమిటండీ, మూగదాన్ని పట్టుకుని మీ చిరాకంతా దానిమీద

గుండె గొంతుకలోన

చూపిస్తారూ? పాపం నోరూవాయీ లేవి మనిషది. ఏదో తన పని తను చేసుకుపోతోంది. దానివల్ల మీకొచ్చిన యిబ్బందేముంది ! దానిమీద నోరు చేసుకుంటారేం, పెరట్లో ఎంతలా కుమిలి పోతోందో చూడండి ...'' అంది రాఘవతో.

''మూగిముండ మాటలు రాకపోతే రానట్టు నోరు మూసుకుని పడుండాలి కాని... ఆ అరుపులేమిటి.. దాని గొంతు వినిపిస్తే కారం నలిచి నట్టుంటోంది నాకు ..'' అని విసుక్కున్నాడు రాఘవ.

రాఘవకి ఆ పూరన్నా, ఊర్లో మనుషులన్నా అసహ్యం ఆ కోపం అందరి మీదా చూపిస్తూ ఉంటాడు. రంగిని చూస్తే మొదటి నుంచీ అతనికి మంటగా ఉంటోంది-- కారణం, దాన్ని కుదిర్చి పెట్టింది అత్తగారు కనుక !

డాక్టరు కోర్సు పూర్తి కాకుండానే రాఘవకి హేమతో వివాహమయింది. కాని, కాపరానికి రాలేదు కోర్సు పూర్తయేసరికే ఉన్న ఆస్తి కాస్తా హరించుకుపోయింది. హౌస్‌సర్జను చేసే నాటికి చేతిలో చిల్లిగవ్వ లేదు అప్పుడు ఆదుకున్నదీ— తరువాత యీ ఊళ్ళో క్లినిక్ పెట్టించి ప్రాక్టీసు చేసుకునేందుకు సహాయం చేసిందీ కూడా హేమ తండ్రి అవధానిగారే. చివరికి అతని సహాయం అందుకోవలసిరావడం రాఘవకి తీరని అవమానంగా తోచింది అయినా మరో మార్గం కనిపించక ఊరుకోక తప్పిందికాదు కాని న్యూనతా భావాన్ని అతను అధిగమించలేకపోతున్నాడు. ఆ కోపం, చిరాకు అందరిమీదా ప్రదర్శిస్తూ ఉంటాడు. మంచి టౌన్లో ప్రాక్టీసుపెట్టి రెండు చేతులా సంపాదిద్దామనుకున్న అతని ఆశ ఆశగానే మిగిలిపోయింది. తన కలలనీ, భవిష్యత్తునీ, ఎవరో కసిగా కాలరాచివేస్తున్నట్టు బాధపడుతూ ఉంటాడు. ఏదో తెలీని అసంతృప్తి అతన్ని వెంట తరుముతూ ఉంటుంది. ఊర్లో పెద్దగా పోటీ లేకపోవడంచేత నాలుగు డబ్బులు వస్తున్నప్పటికీ అతని మనసులో అగాధం మాత్రం పూడ్చుకోలేదు. తన వృత్తి ధర్మాన్నికూడా మరిచిపోయి ప్రవర్తిస్తూ ఉంటాడతను. వచ్చిన రోగుల దగ్గర కర్కశంగా ఫీజు వసూలు చెయ్యందే పరీక్షించడు అందరివలనా తనకి తీరని ద్రోహమేదో జరిగిపోయినట్లుగా ఊహించుకొంటూ, అందుకు ప్రతీకారం తీర్చుకుంటున్నట్లుగా అతను ప్రవర్తిస్తూ ఉంటాడు హేమ అతని ప్రవర్తనని గమనిస్తున్నా ఏమీ అనలేక ఊరుకుంటూ ఉంటోంది.

వీధిలో రంగి గొంతు వినిపించి రాఘవ మరింత విసుగ్గా హేమవేపు చూసేడ. ''అదిగో, మీ మూగిముషాణం వచ్చింది పనిలోకి .. కాస్త నోరు మెదపకుండా పని చేసుకోమని చెప్పు'' అన్నాడు హేళనగా

ఆ వెటకారం భరించరానిదిగా తోచింది హేమకి

''మీకిది ధర్మంకాదు అది మూగదే కావచ్చు అంతమాత్రంచేత దాన్ని చులకనచేసి మాట్లాడ్డం మీకు తగదు, మీకసలు మా వాళ్ళ మీద కోపం. ఆ కసినీ, చిరాకునీ యిలా అందరి మీదా వెళ్ళగక్కుతూ ఉంటారు'' ఉండబట్టలేక అనేసింది

''నోర్ముయ్.. నోటికొచ్చింది వాగకు నీకు దానిమీద అంత సానుభూతి, దయవుంటే పనిమనిషిగాకాదు — స్వంత చెల్లెలిగా చూసుకో నాకోసం యింటికి ఫ్రెండ్సూ వాళ్ళు వచ్చి పోతుంటారు — వాళ్ళముందు దీని వికారపు గొంతు విని నేను సహించలేను మరో పని మనిషి దొరకనట్టు దీన్ని తెచ్చి మన నెత్తిమీద పెట్టింది మీ అమ్మ ఆవిడ్ననాలి అసలు ''

అతని కోపం తమ కన్నవారి మీదకి మళ్ళడంతో హేమ ఓ క్షణం మాట్లాడలేదు తర్వాత చెప్పడానికి ప్రయత్నిస్తూ చెప్పింది ''అది కాదండీ - మూగిదయితేనేం చెప్పిన పని జాగ్రత్తగా చేసుకుపోతుంది చాలా నమ్మకస్థురాలయిన మనిషండీ ఈ ఊర్లో అలాంటి పని మనిషి దొరకడం కష్టం అయినా కాస్త నిశ్శబ్దంగా ఉండమని చెబుతానులెండి ''

రాఘవ కోపంగా 'హుం' అంటూ పేపరు అడ్డం పెట్టుకుని మరేం మాట్లాడలేదు హేమ సిద్ధం చేసిన బూట్లు తొడుక్కుని క్లినిక్‌కి బయలుదేరాడు

హేమ నిట్టూరుస్తూ ఉండిపోయింది

* * *

మర్నాడు ఉదయం రంగి ఎంత పొద్దెక్కినా పనిలోకి రాలేదు ముందురోజు తనకీ భర్తకీ జరిగిన సంభాషణ విన్నాదేమో ! ఎంత బాధ పడిందో . ఛీ ఏం మనిషి ఈయన? ఎంత చదువుకుంటే మాత్రం ఏం లాభం — సంస్కారం మరిచిపోయేక ఎదుటి మనిషిలోని శారీరక లోపాన్ని ఎత్తి చూపెడుతూ హేళన చెయ్యడం ఎంత నీచం !

హేమ కాలుగాలిన పిల్లిలా యింట్లో అటూ యిటూ తిరుగుతోంది. ఎక్కడి పని అక్కడే ఉందింకా. భర్త క్లినిక్‌కి వెళ్ళిపోయేడు. లిల్లీ కాన్వెంటుకి వెళ్ళిపోయింది. కాఫీగ్లాసులూ, టిఫిన్ ప్లేట్లూ యింకా అలాగే పడి ఉన్నాయి బాత్‌రూంలో తడిపి ఆరేయవలసిన బట్టలు బకెట్ నిండా వున్నాయి అంట్లగిన్నెలు సరేసరి ఇల్లంతా చిందరవందరగా ఉంది. లేచి చీపురు తీసుకుని గది తుడుద్దామనుకుంటూ వుంటే రంగి గొంతు వినిపించింది. ''హమ్మయ్య'' అనుకుని హాలులోకి వెళ్ళింది హేమ.

రంగి నిలబడివుందక్కడ. దాని చంకన దాని కొడుకు — ఏడాది పసిబిడ్డ ఉన్నాడు. వాడి ఒంటిమీద జుబ్బాగుడ్డ కూడా లేదు చింకి తువ్వాలు వాడిమీద కప్పింది రంగి ముఖం

ఇటీవల చిలకలూరిపేట డి.ఆర్ ఎన్. డిగ్రీ కళాశాలవారు నిర్వహించిన అంతర్ కళాశాల కథల పోటీలలో ద్వితీయ బహుమతి పొందిన కుమారి బి మంజులకి బహుమతి నందజేస్తున్న కళా సదస్సు అధ్యక్షుడు శ్రీ కందిమళ్ల నారాయణమూర్తిని చిత్రంలో చూడవచ్చు.

కూడా పీక్కుపోయి వుంది. దానికళ్ళు రాత్రంతా నిద్ర లేనట్టుగా ఎర్రగా తయారయి వున్నాయి. బాగా ఏడిచినట్లుగా ఉంది. ముఖం ఉబ్బిపోయి వుంది. చిరుగుల చీర, రవిక. తైల సంస్కారం లేని జుత్తు. లోతుకుపోయిన దవడలు

దాని రూపం చూసి జాలివేసింది హేమకి పాపం, ముగ్గురు పిల్లలు దానికి. పుడుతూనే మూగిదానిగా పుట్టింది. కట్టుకున్న మొగుడు దాని కాపురంలో నిప్పులు పోసి ఎక్కడికో పోయేడు. అప్పట్నుంచీ అదే నాలుగిళ్ళలో పాచిపనులు చేస్తూ నెట్టుకొస్తోంది.

రంగి చేతిలో బిడ్డని చూపిస్తూ ''వాడికేమయిందే. పాపం, వొంట్లో బాగు లేదా ?'' అనడిగింది హేమ.

ఆపాటి సానుభూతి పలుకులు అంతవరకు ఎవరి నోటినుండి కూడా విననిదానిలాగా రంగి గుండె పగిలినట్లు బావురుమంది

''ఛ ఛ.. ఊరుకోవే ఊరుకో డాక్టరుగారు యిప్పుడే క్లినిక్‌కి వెళ్ళిపోయేరు కొంచెం ముందుగా రాలేకపోయావా?. సరేలే క్లినిక్‌కి తీసికెళ్ళి చూపించు'' అని ఊరడించింది

మరో రెండు మూడు నిముషాల వరకూ రంగి ఏడుపు ఆపుకోలేకపోయింది తర్వాత బెక్కుతూ మూగిభాషలోనే హేమకి ఏదో వివరించబోయింది కాని హేమకి అది చెప్తున్న దేమిటో అర్థమే కాలేదు.

ఆ మూగ హృదయం తన వేదనని ఏమని చెప్పుకోగలదు ?

తన గుండెలోని బాధని ఎలా వివరించ గలదు ?

ఆ పిచ్చితల్లి దుఃఖించగలదు కానీ -- తన దుఃఖానికి కారణం మరొకరితో మాటలలో ఎలా పంచుకోగలదు !

ఆ అమాయకపు గుండె గొంతుకలో కొట్లాడుకోవలసిందేకానీ —

ఆ గుండె బరువు దించుకోవడం సాధ్యం కాదు.

ముందు రోజు సాయంత్రం కొడుకుని తీసుకుని రాఘవ క్లినిక్‌కి వెళ్ళానని — గేటుదగ్గర పని కుర్రాడు ఫీజు లేనిదే లోపలకి వదల నన్నాడనీ — తన గొంతు వినయినా రాఘవ జాలిపడి రానిస్తాడని పెద్దగా అరిస్తే — రాఘన మండిపడ్డాడనీ — నోటికొచ్చినట్టు తిట్టిపోసేడనీ కొడుకుని సరిగా చూడనైనా చూడకుండానే ఏదో మందుచీటీ రాసి ముఖాన కొట్టి పంపించే డనీ — ఆమె హేమతో చెప్పుకోలేకపోయింది.

ఒక యింజక్షనో, మాత్రో యిస్తాడను కున్న రంగి హతాశురాలయింది. మనుష్యుల్లో — ముఖ్యంగా డాక్టర్లలోకూడా అలా కర్కశంగా ప్రవర్తించగలిగే వ్యక్తులుంటారని ఆమెకి తెలీదు

రాత్రంతా రంగి కొడుకు మందులేకుండా అలాగే ఉండిపోయేడు. ఒళ్ళెరుగని జ్వరంలో మూసిన కన్ను తెరవలేదు ఈ మనోవేదన హేమతో చెప్పుకోడానికి భగవంతుడామెకి నోరు యివ్వలేదు. తన బాధ తనలోనే దిగమ్రింగుకుని, కళ్ళలో నీళ్ళు కుక్కుకుని వుండిపోయింది రంగి.

చింకితువ్వాలు హాలులో ఓ మూల పరిచి పిల్లాడిని దానిమీద పడుకోబెట్టి, పాచిపని చెయ్యడానికి పెరట్లోకి దారితీసింది. కొడుకు ఆ పరిస్థితిలో వున్నప్పటికీ అది వచ్చి పని చెయ్యబోవటం చూసి హేమ మనసు బాధపడింది వద్దని వారించబోయింది కానీ—పెరట్లో పేరుకు పోయిన అంట్లగిన్నెలూ అవీ గుర్తొచ్చి మరేం అనలేకపోయింది హేమ

పనంతా పూర్తిచేసి వెళ్ళొస్తానన్నట్లుగా సౌంజ్ఞచేసి పిల్లడ్ని ఎత్తుకుని యింటికి వెళ్ళిపోయింది రంగి.

*   *   *

ఆ సాయంత్రం రంగి విషయమై హేమకీ, రాఘవకీ చిన్న ఘర్షణ జరిగింది రాఘవ కఠినంగా అన్నాడు ''నాన్సెన్స్ — దాని వికారపు గొంతు, ఆ ఏడ్పు అరుపులు యింటిదగ్గరే భరించలేక పోతుంటే — క్లినిక్‌కొచ్చి నానా అల్లరీ చేసిందది ఫీజు తీసుకోకుండా కంకణం కట్టుకుని క్లినిక్ పెట్టుకుని కూచోలేదక్కడ ''

''అది మన యింట్లో పనిచేసే పనిమనిషే కదండీ ఉచితంగా చూస్తే ఏం తరిగిపోతుంది మనకి ''

''పనిమనిషేకాని యింట్లో మనిషికాదు కదా అది చేస్తున్న పనికి జీతం యిస్తున్నాం దట్సాల్ దానిలాంటివాళ్ళు ఈ ఊర్లో చాలా మంది వున్నారు అసలీ దిక్కుమాలిన ఊర్లో అలాంటి బికారి వెధవలే ఎక్కువ వాళ్ల దొంగ ఏడుపులకీ, నంగి నటనలకీ కరిగిపోతే మన పని అంతే ''

''మీరు డాక్టరు మీ వృత్తి ఎంత పవిత్రమయిందో నేను చెప్పనక్కరలేదు కాస్త పేదసాదలని చూడకపోతే ఎలాగండీ ?'' తెగించి అంది హేమ

''ఒహో.. నాకే నీతులు చెప్తున్నావన్న మాట... మీ నాన్న ప్రాక్టీసు పెట్టుకోడానికి మదుపు పెట్టాడన్న అహంభావంతోనే కదా నాకిలా నీతులు చెప్పగలుగుతున్నావు ?'' అని అరిచేడు రాఘవ.

తమ సంభాషణ అటుతిరిగీ యిటుతిరిగీ మళ్లీ తన తండ్రి ప్రస్తావన వచ్చేసరికి మరేం మాట్లాడలేకపోయింది హేమ

తన తండ్రి యిచ్చిన డబ్బు అతనికంత చేదయినదయితే ఎందుకు తీసుకోవాలి ? పెళ్లికి ఎందుకు కట్నం పుచ్చుకున్నారు ? చదువుకునే రోజుల్లో మనీఆర్డర్లు ఎలా అందుకున్నారు తన తండ్రిపై అతనికెందుకంత అక్కసు అతని మాటల్లోని వెటకారం ఆమెకు ములుకులా గుచ్చుకుని భాధించింది

తల దించుకుని మౌనంగా ఉండిపోయింది

*   *   *

రెండు రోజులు గడిచేయి. ఆ రోజు సాయంత్రం ఏడుగింటలు కావస్తోంది రాఘవ క్లినిక్‌లో పేషెంట్లని చూస్తున్నాడు కంపౌండరు మందుల బల్ల దగ్గర హడావిడిగా ఉన్నాడు. మరో పని కుర్రాడు ద్వారం దగ్గర నిల్చుని రోగుల్ని ఒక్కొక్కరినే లోపలికి పంపిస్తున్నాడు

ఇంతలో ద్వారం దగ్గర రంగి గొంతు గాభరాగా వినిపించింది. రాఘవ చిరాగ్గా తలెత్తి చూసేడు రంగి లోపలకి నెట్టుకొని రావడానికి పని కుర్రాడితో ఘర్షణ పడుతోంది. వాడామెను లోపలికి రానివ్వడంలేదు. అది మరింతగా పెనుగులాడుతోంది. అర్థంకాని భాషలో బిగ్గరగా అరుస్తోంది. దాని కేకలతో క్లినిక్ మార్మ్రోగిపోతోంది.

గొంతు చించుకుని అరుస్తూ ఏదో

చెప్పడానికి ప్రయత్నిస్తోందామె. ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి దెయ్యాన్ని చూసిన దానిలా గజగజలాడిపోతోంది.

''సెస్ .. ఆగే నీయమ్మ . . నీకంటే ముందు చాలామంది వచ్చేరు పేద్ద . . ఫీజు యిచ్చేదానిలా తోసుకుని వచ్చేస్తున్నావు .. ఫో.. నోరు మూసుకుని అక్కడకు పోయి కూచో '' అని కసురుతున్నాడు పని కుర్రాడు

అది తన పట్టు విడవకుండా అతన్ని తప్పించుకుని రావటానికి ప్రయత్నం చేస్తోంది వాడు దాని జబ్బ పట్టుకొని వెనక్కి తోసేడు వెనక్కి తూలిపడబోయి నిల్దొక్కుకుంది. ఆమె ఒంటిమీద చిరుగుల పైట జారిపోయి, బొత్తాలు లేని జాకెట్టులోనుంచి వాలిన వక్షోజాలు కనిపిస్తున్నాయి కాని — ఇదేమీ పట్టించుకునే స్థితిలో లేదామె.

ఈ దృశ్యం చూసి రాఘవ ఒళ్ళు అసహ్యంతో జలదరించుకుపోయింది. అతనికి శరీరంమీద తేళ్ళూ జెర్రెలూ ప్రాకినట్లనిపించింది. అతనికి రంగి ప్రవర్తన అసభ్యంగాను, పరమ రోతగానూ తోచింది. దాని కొడుక్కి ప్రాణంమీదకి ముంచుకొచ్చింది కాబోలు. తనని దాని మురికి కొంపకి తీసుకుపోడానికి వచ్చినట్లుంది హెల్ విత్ హెర్ సన్. ఈ ముండని మెడపట్టుకుని గెంటించెయ్యాలి. .ఎంత న్యూసెన్స్ చేస్తోంది. ఇప్పుడు దీని కొంపకి వెళ్ళడమా! ఫీజు బాగా యిచ్చేవాళ్ళ యిళ్ళకి తప్ప ఎక్కడకీ వెళ్ళడం తనకిష్టం వుండదు. ఎంత చావు బ్రతుకుల్లో వున్నా రోగిని క్లినిక్కి తీసుకురావలసిందే —

రాఘవ ఆలోచనలు తెగక ముందే రంగి బలమంతా ఉపయోగించి, పనికుర్రాణ్ని నెట్టుకుని లోపలికి వచ్చి రాఘవ కాళ్ళమీద పడిపోయింది వెక్కి వెక్కి ఏడుస్తూ గగ్గోలు పెట్టెయ్యడం ప్రారంభించింది ఇంక లాభం లేదు .. దీని న్యూసెన్స్ భరించలేనిదిగా వుంది ఇప్పుడు దీని వెంట వెళ్ళక తప్పేలా లేదు కాదని భీష్మించుకు కూచుంటే అందరి దృష్టిలోనూ మరీ కర్కోటకుడనిపించుకునే ప్రమాదం వుంది

అయిష్టంగానే కుర్చీలోనుంచి లేచి, పద అన్నట్టుగా తలవూపి రంగి వెంట బయలుదేరాడు రాఘవ కంపౌండరు మందుల కిట్ పెట్టుకుని అతడిని అనుసరించేడు ఏదో సాధించేనన్న తృప్తితో రంగి అక్కడికక్కడే చేతులెత్తి గాలిలోనే దండాలు పెట్టేస్తోంది తనలో తనే ఏదో మాట్లాడుకుంటున్నట్టు అరుస్తూ బయలుదేరింది

అలా బయలుదేరిన రంగి తన పూరింటి ముందు ఆగలేదు!

డాక్టర్ రాఘవ ఆశ్చర్యపోయాడు తెల్లబోతూ ప్రశ్నార్థకంగా ఆమెవేపు చూసేడు

గుండె గొంతుకలోన

అక్కడ కాదన్నట్టుగా రంగి అడ్డంగా తల వూపుతూ ముందుకి నడిచింది గబగబా ఏ సంగతీ అర్థంకాక రాఘవ ఆమెని అనుసరించేడు

రంగి వడివడిగా నడుస్తూ ఓ సందు తిరిగి అక్కడ ఆగిపోయింది —

ఆమె వెనుక అసహనంతో, చిరాగ్గా, కోపంగా ధుమధుమలాడిపోతూ వస్తున్న రాఘవ కొయ్యబారిపోయినట్లు నిలబడిపోయేడు!

అతని జవసత్వాలూ ఉడిగిపోయినట్లయేయి జీవచైతన్యం కోల్పోయిన వాడిలా అయిపోయేడు కళ్ళముందు గాఢమయిన చీకటి తెరలు కదలాడుతున్నట్టనిపించింది

''రండి రండి.. '' అన్నట్లుగా చేతులో అభినయిస్తూ గుండెలు బాదుకుంటూ రంగి వేగంగా ఆ యింట్లోకి దారితీసింది

ఆ యింటి తలుపుమీద ''డాక్టర్ ఎస్ రాఘవ, ఎం బి బి ఎస్'' అన్న బోర్డు ఉంది .

* * *

రాత్రి పదకొండు గంటల ప్రాంతం

డాక్టర్ రాఘవ చేతుల్లో ముఖం పెట్టుకుని కుమిలిపోతున్నాడు అతని హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోతోంది. ఎదురుగా మంచంమీద సగం కాలిన శరీరంతో మూలుగుతూ పడుకునివుంది లిల్లీ పాప కాలిన గాయాలమీద మందు రాసి చేతులు శుభ్రం చేసుకుని అలసటగా కుర్చీలో కూలబడిపోయింది హేమ ఆమె ముఖం దైన్యంతో పీక్కుపోయి వుంది

తల్లి వంట చేస్తున్నప్పుడు ఆమె వెనుకనే తిరుగుతూ తల్లి పరాకుగా ఉన్నపుడు స్టౌమీద గిన్నె ముట్టుకోబోయి తూలి పడిపోయిందా పిల్ల. ఫ్రాక్ అంటుకుంది హేమ భయంతో కేకలు వేస్తూ స్పృహతప్పి పడిపోయింది. అక్కడే ఉన్న రంగి చప్పన మంటలు చేతులతో ఆర్పడానికి ప్రయత్నించి సాధ్యంకాక నీళ్ళుపోసి ఆర్పేసింది ఆ ప్రయత్నంలో దాని అరచేతులు బొబ్బలెక్కాయి. లిల్లీకి ప్రాణగండం తప్పింది... మంటలు ఆర్పేసాక స్పృహకోల్పోయి వున్న హేమ ముఖంమీద నీళ్ళుజల్లి ఆమె కొంచెం కదిలినట్లనిపించేక, భయంతో ఆదరాబాదరాగా రాఘవని తీసుకురావడానికి క్లినిక్కి పరుగెత్తింది రంగి.

జరిగిందంతా తలచుకుంటూ ఉంటే రాఘవ మనసు విలవిలలాడిపోతోంది తను మనిషేనా? రంగిని ఎంత నీచంగా, లోకువగా చూసేడు.. రంగి లేకపోతే లిల్లీ తమకి దక్కేదా? అతని గుండె జలదరించుకుపోయింది ఆలోచించడానికే భయం వేస్తోంది రంగిని ఎంత హేయంగా తూలనాడేడు తను! ఆమె మూగదవడం ఒక శాపమైతే -- అందుకు మనిషిగా, జాలి, సానుభూతి చూపించడానికి బదులు ఏం చేసాడు తను! తన చదువు, డిగ్రీ, విజ్ఞానమూ అన్నీ ఏమైపోయేయి!

రంగికి తన కృతజ్ఞతలు ఎలా తెలియజేయడం? ఆమె మూగ గుండెకి ఏ భాషతో చెప్తే అర్థమవుతుంది. అతనికి చప్పన రంగి కొడుకు గుర్తొచ్చేడు అవును వాడికి జబ్బుగా వుందని కదూ మొన్న క్లినిక్కి తీసుకొచ్చింది ఇప్పుడెలా ఉన్నాడో

భర్త చాలాసేపటినుంచి సోఫాలో కూచుని ఏదో ఆలోచిస్తూ తనలోతనే బాధపడడం గమనించింది హేమ లిల్లీకి ఆ ప్రమాదం జరిగేక ఆమె తీవ్రంగా చలించిపోయింది ఇప్పుడిప్పుడే ఆమె ఆ షాక్ నుంచి కోలుకుంటోంది

భర్త డ్రస్‌చేసుకుని, మెడలో స్టెతస్కోప్ వేసుకుని మందుల కిట్ స్వయంగా తనే పట్టుకుని ఎక్కడికో బయలుదేరుతూ ఉండటం చూసి అడిగింది — ''ఎక్కడికండీ యింత రాత్రివేళ ఏదైనా అర్జంటు కేసు వచ్చిందా?'' అని

రాఘవ ఆగి, ఆమె ముఖంలోకి చూసి అన్నాడు· ''రంగి యింటికి హేమా! దాని కొడుక్కి ఎలా ఉందో. చూసివస్తాను తలుపు వేసుకో రంగి ఋణం యిలాగయినా తీర్చుకోవాలి నేను .'' అంటూ వీధిలోకి దారితీసాడు

''రంగి రంగి కొడుకు. మధ్యాహ్నం చని పోయే. డండీ . మన పాలమనిషి చెప్పింది.. సాయంత్రం ''

వీధి మెట్లు దిగబోతూఉంటే - వెన్ను జలదరించుకుపోయేలా హేమ మాటలు రాఘవ చెవులకి పిడుగుల్లా వినిపించేయి

అతని అడుగు మరి ముందుకు సాగలేదు. ★

పచ్చినిజం!

నీ స్వార్థం మట్టుబెట్టి
నిస్వార్థం గుండెలోన
నిజాయితీకి పీట వేసి
నీతి కొరకు కోట కట్టినా
నీ తోడి సమాజం
నీతొడ్డిన సమాజం
నీకోసం తన నైజం
నిజం నిజం మార్చబోదు!!!

— యస్వీ.కె. మల్లిక్